క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



గుడివాడరూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో గుడివాడ క్రీడాకారులు సత్తా చాటడం అభినందనీయమని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎస్పీఎస్ మున్సిపల్ పాఠశాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 23, 24 తేదీల్లో చెన్నై ఆడియార్ యూనివర్సిటీలో హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రం తరపున పోటీల్లో పాల్గొని రజత పతకాలను సాధించిన గుడివాడ ఎస్పీఎస్ మున్సిపల్ పాఠశాల క్రీడాకారులు అభినందనీయులన్నారు. పట్టణానికి చెందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో పతకాలు సాధించడం గుడివాడ పట్టణానికి గర్వకారణమన్నారు. విద్యార్థులు పతకాలు సాధించడంలో కృషి చేసిన కోచ్ మడకా ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాణి, కోచ్ మడకా ప్రసాద్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడి శాంతి కల్యాణం

ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణతంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

దరఖాస్తు చేసుకోండి

కైకలూరు: స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్ అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత మంగళవారం తెలిపారు. కామర్స్ సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. దీంతో పాటు నీట్, ఏపీ సెట్, పీడబ్ల్యూడీ చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురువారం కాలేజీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ఎంఈఓ సేవలు ప్రశంసనీయం

కైకలూరు: విద్యా విధానాల అమలులో కలిదిండి విద్యాశాఖాధికారి పిడుగు ప్రభాకరబాబు చేసిన సేవలు ప్రశంసనీయమని కలిదిండి మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. కలిదిండి శశి పబ్లిక్ స్కూల్లో ఎంఈఓ ప్రభాకరబాబు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ డెమోక్రాట్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ తన సర్వీస్ కాలంలో ఒక్కరోజు కూడా సెలవు ఉపయోగించుకోకుండా విధులు నిర్వహించిన వ్యక్తి ఎంఈఓ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ కైకలూరు డివిజన్ అధ్యక్షుడు ఎ.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శి నిలదీత

మండవల్లి: స్థానిక బీసీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం సచివాలయంలో ధ్వజమెత్తారు. సమస్యలపై స్పందించాలని సర్పంచ్ ఝాన్సీ, కార్యదర్శి శ్రీనివాసరావును నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటిలో పురుగులు వస్తున్నాయని, పందులు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడన్నారు. రోడ్లపై మురుగు చేరి దోమలు వృద్ధి చెంది రాత్రి వేళల్లో కంటిపై కునుకు కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

గుడ్లవల్లేరు: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందన్న మనస్థాపంతో జుజ్జువరపు రత్నాకరరావు(34) జాన్సన్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు గుడ్లవల్లేరు మండలం కూచికాయలపూడిలో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్న జాన్సన్‌కు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. సోమవారం మధ్యాహ్నం జాన్సన్‌కు తన భార్యకు మధ్య గొడవ జరిగింది. భార్య తన కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో సోమవారం రాత్రి ఇంటిలో చీరతో ఉరి వేసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానికులు జాన్సన్ ఆత్మహత్యను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జాన్సన్ మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సారథి బాబు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

పెదపారుపూడి: మండలాభివృద్ధికి, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతో మాట్లాడుతూ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు రాకపోవటంతో అలాంటివారిని గుర్తించి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ సీతా మహాలక్ష్మిని ఆదేశించారు.

గ్రామానికి జ్వరమొచ్చింది

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కూచిపూడిలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు

మొవ్వ: వాతావరణంలో మార్పులు, లోపించిన పారిశుద్ధ్యం కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలాయి. మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడ చూసినా జ్వరపీడితులు ఇబ్బందులు పడుతున్నారు.

మొవ్వ, కూచిపూడి, కోసూరు, కాజ, పెదపూడి గ్రామాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల వద్ద వ్యాధిగ్రస్తులు కిటకిట లాడుతున్నారు. కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి, అయ్యంకి, మొవ్వ గ్రామాల్లో టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు, డెంగి బారిన పడి పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



పెదపూడిలో తాగునీటి కుళాయి వద్ద నిల్వ ఉన్న మురుగు నీరు



కొండవరంలో పేరుకుపోయిన మురుగు

పారిశుద్ధ్య లోపం

మొవ్వ మండలంలోని పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించక పోవటంతో దోమలు విపరీతంగా పెరిగి, పలు వ్యాధులకు కారకాలవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లటం లేదని, దోమల నివారణ మందు పిచికారీ చేయడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటి పారుదల, దోమల నివారణపై దృష్టి పెట్టకపోవటం లాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజారోగ్యంపై దృష్టి సారించి, పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిల్లో 52 రకాల పరీక్షలు చేస్తాం



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం. ప్రభుత్వాస్పత్రుల్లో 52 రకాల టెస్టులు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల్లో సుమారు ఐదు వేలకు పైగా టెస్టులు నిర్వహించాం. ఎన్ఎస్ఐ (డెంగ్యూ ర్యాపిడ్)లు 34 చేశాం. ఒక్కరికి కూడా పాజిటివ్ రాలేదు. అలాగే 52 మందికి టైఫాయిడ్ పాజిటివ్ వచ్చినట్లు గుర్తించాం. పూర్తి స్థాయి వైద్యం అందించాం. డెంగీ నిర్ధారణకు ఎలీషా టెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ టెస్ట్ మచిలీపట్నం, విజయవాడ ఆస్పత్రిలో చేస్తారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్లు ఉన్నాయి. వైరల్ ఫీవర్‌కు కూడా ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి.

– డాక్టర్ వేదరాజ్, మొవ్వ మండల వైద్యాధికారి

ఆర్‌ఎంపీలను సంప్రదించొద్దు



వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు వస్తుంటాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు శుభ్రమైన ఆహారం, తాగునీరు తీసుకోవాలి. ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే దగ్గరలోని హెల్త్ సెంటర్‌కు గానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలి. గ్రామాల్లో ఆర్‌ఎంపీలను ఆశ్రయించ వద్దు. ప్రైవేటు ల్యాబ్‌లలో చేసే ఖరీదైన రక్త పరీక్షలు సైతం ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోండి.

– డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి

టైఫాయిడ్‌తో బాధపడుతున్నా



నాది మొవ్వ మండలం ముత్రాసిపాలెం. మూడ రోజులుగా ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నా. పెదపూడిలోని ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నా. రక్త పరీక్షలు చేసి టైఫాయిడ్ అని చెప్పారు. నాతో పాటు జ్వర పీడుతులతో ఆస్పత్రిలో చాలా మంది రక్త పరీక్షలు చేయించుకున్నారు.

– పీ నాగబాబు

ప్లేట్‌లెట్స్ పడిపోయాయి



నాది మొవ్వ మండలం పెదపూడి గ్రామం. నేను, నా భార్య జ్వరంతో చాలా ఇబ్బంది పడ్డాం. ఐదు రోజులు సెలైన్ పెట్టారు. నాకు, నా భార్యకు ప్లేట్‌లెట్స్ బాగా తగ్గాయి. అవి 40 వేలకు చేరటంతో సీరియస్ అయింది. భట్లపెనుమర్రులోని ఆర్‌ఎంపీ డాక్టర్ వద్ద చికత్స చేయించుకున్నాం. ప్రస్తుతం బాగానే ఉంది.

– పి. శివ

ఆర్‌ఎంపీలు పరిధి మేరకే వైద్యం చేయాలి



గుడివాడరూరల్: ఆర్‌ఎంపీ వైద్యులు తమ పరిధి మేరకే ప్రాథమిక వైద్య సేవలు అందించాలని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ సి.సుదర్శనబాబు సూచించారు. ఏపీఆర్ జేఏసీ ఆధ్వర్యంలో పెంపా ఫెడరేషన్ ఆదేశానుసారం ప్రథమ చికిత్సపై గుడివాడ ఏరియాలోని ఆర్‌ఎంపీ వైద్యులకు స్థానిక ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వ్యాధికైనా ముందుగా యాంటీబయోటిక్స్ వాడాల్సిన అవసరం లేదన్నారు. వైద్యం మొదటి మెట్టుతో ప్రారంభం అవ్వాలని సూచించారు. ప్రాథమిక వైద్యం అనంతరం రోగి కోలుకోవటంలో అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలలకు తరలించాలన్నారు. అధికంగా వైద్యం చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని ఆర్‌ఎంపీలకు సూచించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సాగిరాజు ఉదయభాస్కరరాజు, నండూరి ఉమాశంకర్, కోలా వెంకటేశ్వరరావు, లంకపల్లి రవి, రమేష్‌బాబు, ఫణిగోపాల్, నాగచంద్రశేఖర్, ఎర్రంనాయుడు, విజయ, శిరీష పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కాజ(మొవ్వ): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 12 (180ఎంఎల్) బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు కూచిపూడి ఎస్ఐ టీ శ్రీనివాస్ తెలిపారు. మొవ్వ మండలంలో నిఘా ఉంచగా కాజ నుంచి పెద్దారాయుడుతోట గ్రామానికి మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని కాజ శివారులో సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పాములలంక గ్రామాల్లో పలువురు మృతుల కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. కార్యకర్తల యోగ క్షేమాలను అడిగి తెలుసుకోవటంతోపాటు అన్ని విధాలా అండగా ఉంటామని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నందేటి గంగాభవాని, శీలం రమేష్, బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పెనమకూరు నరశింహశర్మ, ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్, నాయకులు కిలారం శ్రీనివాసరావు, నడకుదురు రాజేంద్ర, చింతలపూడి గవాస్కర్‌రాజు, హరిప్రసాద్, పాతూరి రవి, సోలే నాగరాజు పాల్గొన్నారు.



వల్లూరుపాలెంలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

డీవైఈఓ పద్మరాణి



గుడివాడరూరల్: పరిశుభ్రత, ఆరోగ్యంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని గుడివాడ డీవైఈఓ ఐ.పద్మరాణి అన్నారు. స్థానిక ఎస్పీఎస్ మున్సిపల్ హైస్కూల్లో చేతుల పరిశుభ్రతపై రెండో దశ ఉపాధ్యాయుల అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. డీవైఈఓ మాట్లాడుతూ పిల్లలకు పరిశుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. చేతులు శుభ్రం చేయకపోవడం వలన వివిధ రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు ఆరోగ్యం ముఖ్యమన్నారు. ఆరోగ్యంపై విద్యార్థులు చిన్నతనం నుంచే శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలాజీ, హెచ్‌ఎం టీఎంఈ రాణి, ఎస్ఏఆర్‌డీఎస్ ప్రోగ్రామ్ రిసోర్స్ పర్సన్ ప్రసాద్, జిల్లా మేనేజర్ నళిని, డివిజన్ పరిధిలోని 50 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సదస్సులో అనంతరం ఉపాధ్యాయులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలను డీవైఈఓ అందజేశారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

పామర్రు: గ్రామంలో చురుగ్గా పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్నామని సర్పంచ్ కె.కస్తూరి పేర్కొన్నారు. స్థానిక వార్డులలో ఉన్న డ్రెయిన్లను మంగళవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో బ్లీచింగ్ చల్లించామన్నారు. చెత్తకుండీల వద్ద ఉన్న చెత్తను తొలగించినట్లు తెలిపారు. కార్యదర్శి సలీం, శానిటరీ మేస్త్రీ శివ నాగు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా తీవ్ర నేరం

కైకలూరు: మానవ అక్రమ రవాణా సమాజంలో తీవ్ర నేరంగా పరిగణిస్తున్నట్లు కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కైకలూరు విజ్ఞాన్ కాలేజీలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ 1860 నాటి భారత శిక్షా స్మృతి (ఐపీసీ) చట్టం స్థానంలో భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టం అందుబాటులోకి వచ్చిందన్నారు. గత ఐపీసీలో మానవ అక్రమ రవాణా జరిగితే విడిగా సెక్షన్ 324, 376 ప్రయోగించేవారన్నారు. ప్రస్తుతం ఆచరణలోకి వచ్చిన బీఎన్ఎస్ చట్టంలో నేరుగా శిక్షించే అవకాశం వచ్చిందన్నారు. ఇందులో సెక్షన్ 111 ద్వారా శిక్ష విధించవచ్చన్నారు. నేర తీవ్రత ఆధారంగా ఉరిశిక్ష కూడా విధించే అవకాశం ఉందన్నారు. మానవ అక్రమ రవాణా ఘటనలు కనిపిస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ జి.పాండురంగారావు, పారా లీగల్ వలంటీర్లు రాంబాబు, హుస్సేన్ పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మి

విద్యాసామగ్రి పంపిణీ



అయ్యవారిరుద్రవరం ఎంపీపీ స్కూల్లో కిట్లు పంపిణీ చేస్తున్న వైస్ సర్పంచ్ నాగరాజు, హెచ్‌ఎం



వాడవల్లి పాఠశాల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్

మండవల్లి: అయ్యవారిరుద్రవరం ప్రాథమిక పాఠశాల్లో మంగళవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. స్కూల్ బ్యాగ్స్, యూనిఫాం, బూట్లు, సాక్స్, బెల్ట్‌లను వైస్ సర్పంచ్ ఇంటి నాగరాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దాసరి రమేష్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ పిచ్చోడు, ఉపాధ్యాయిని జయశ్రీ పాల్గొన్నారు. భైరవపట్నం ప్రాథమికోన్నత పాఠశాల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ నీలపాల రాధా నాగేంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు కిరీటిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ డొక్కా వెంకట్రావు, హెచ్‌ఎం ఎన్‌వీబీ సుబ్రహ్మణ్యం 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు.

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

ముదినేపల్లి రూరల్: వాడవల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్స్ కిట్స్‌ను సర్పంచ్ సుధాబత్తుల వెంకటరమణ మంగళవారం అందజేశారు. హెచ్‌ఎం సాయిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పటిష్టంగా లింగ నిర్ధారణ నిషేధ చట్టం

గుడివాడరూరల్: జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి పేర్కొన్నారు. గుడివాడలోని రీజినల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(హోమియోపతి) ఆస్పత్రి, రమేష్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్ల రెన్యువల్ సందర్భంగా మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ చట్టం పరిధిలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులు, కుటుంబ సభ్యులు ఎవరైనా స్కానింగ్ కేంద్రాలకు వెళ్లి పుట్టబోయే బిడ్డ ఆడ లేదా మగ అని తెలుసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లాలో ఉన్న వైద్యశాలలు, నర్సింగ్ హోమ్స్ పాలిక్లినిక్స్‌ను తప్పనిసరిగా రాష్ట్ర వైద్య, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2002 పరిధిలో నమోదు చేయాలని సూచించారు. వైద్యాధికారి బి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న గీతాబాయి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కైకలూరు మండలం పల్లెవాడ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ రామకృష్ణ మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షిప్తం

ధాన్యం సొమ్ము చెల్లించలేదని ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: పౌరసరఫరాల సంస్థకు ధాన్యం విక్రయించినా ఇప్పటివరకు పూర్తిగా సొమ్ము చెల్లించలేదంటూ కౌలురైతు ఫిర్యాదు చేశారు. మండలంలోని పెదపాలపర్రుకు చెందిన కౌలురైతు కోడూరు శ్రీనివాసరావు ఈ మేరకు సొసైటీల ఏలూరు డిప్యూటీ రిజిస్ట్రార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం శ్రీనివాసరావు గ్రామానికి చెందిన రైతు ఈదర జనార్దనరావు నుంచి నాలుగు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని 2022లో 40 కేజీల బరువున్న 258 బస్తాల ధాన్యాన్ని స్థానిక సొసైటీ ద్వారా పౌరసరఫరాల సంస్థకు విక్రయించాడు. ఇందులో 174 బస్తాల ధాన్యానికి మాత్రమే డబ్బులు రైతు జనార్దనరావు పేరున రూ.61,152 మాత్రమే జమ అవగా ఇంకా రూ.65,850 రావాల్సి ఉందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్థానిక సొసైటీ కార్యదర్శిని, మండల వ్యవసాయాధికారిని సంప్రదించినా వారు సమస్యను పరిష్కరించలేదని ఆయన తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తనకు రావాల్సిన ధాన్యం బకాయి జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో శ్రీనివాసరావు కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గుడివాడరూరల్: స్థానిక 26వ వార్డు కార్మికనగర్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ వీఆర్వో జాలాది ప్రకాశరావు, ఆయన కుమార్తె దివ్యల ఆర్థిక సాయంతో మంగళవారం నోటు పుస్తకాలు అందజేశారు. ప్రతి ఏడాది జాలాది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, స్టడీ మెటీరియల్ అందజేయడం గొప్ప విషయమని పలువురు పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు నీరుడు సురేష్, హెచ్‌ఎం వి.నిర్మలరాణి పాల్గొన్నారు.

తహసీల్దార్ శ్రీపల్లవికి ఘనంగా వీడ్కోలు

పామర్రు: పామర్రు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పడమటి శ్రీ పల్లవి బదిలీపై అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పీ గన్నవరానికి వెళుతున్న సందర్భంగా స్థానిక కార్యాలయంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వై మల్లేశ్వరరావు, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

గుడివాడరూరల్: స్వచ్ఛభారత్ స్ఫూర్తితో గుడివాడలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేపట్టిన ఐలవ్‌యు గుడివాడ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సభ్యులు పట్టణంలోని 36వ వార్డులో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్టేడియం వాకర్స్‌కమిటీ సభ్యులు వార్డులోని వీధుల్లో పేరుకుపోయిన పచ్చగడ్డి, చెత్త మొక్కలను తొలగించారు. వాకర్స్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ, క్లబ్ కార్యదర్శి కోనారామారావు, కోశాధికారి కె.రామకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేసేలా కేంద్ర బడ్జెట్

గుడివాడరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు తీవ్ర అన్యాయం చేసేలా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బడ్జెట్‌లో రైతులకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని నిరసిస్తూ బడ్జెట్ ప్రతులను సీపీఎం నాయకులు మంగళవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆర్సీపీ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు ఎరువుల మీద 24వేల కోట్లు సబ్సిడీని తగ్గించడం అన్యాయమన్నారు. గిట్టుబాటు ధరల కోసం చట్టం చేయాలని సీపీఎం తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆహార ధాన్యాల సబ్సిడీని తగ్గించడాన్ని ఖండించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు మురళీకృష్ణారెడ్డి, ఉమామహేశ్వరరావు, వ్యవసాయదారుల సంఘం నాయకుడు శివనాగమల్లేశ్వరరావు, రాంబాబు, ఐద్వా నాయకురాలు పి.రజని, వి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో గుంతల పూడ్చివేత

కైకలూరు: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కైకలూరులో పామర్రు-దిగమర్రు జాతీయ రహదారి దెబ్బతింది. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలవడంతో అనేక మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడ్డారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో నేషనల్ హైవే అధికారులు గుంతల మరమ్మతులకు టిప్పర్లతో కంకరను పంపారు. దీంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు, కుమారి థియేటర్ సెంటర్, టౌన్ హాలు ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. కూటమి నేతలు పెన్మత్స త్రినాథరాజు, పూలా రాజీ, కొల్లి బాబి తదితరులు పనులను పర్యవేక్షించారు.

భార్యపై భర్త దాడి కేసులో రిమాండ్

గుడ్లవల్లేరు: భార్యపై అనుమానంతో దాడి చేసిన భర్తకు కోర్టు రిమాండ్ విధించింది. పోలీసుల కథనం మేరకు గుడ్లవల్లేరు మండలం కొతవరానికి చెందిన రాజశేఖరరావు తన భార్యపై అనుమానంతో ఆదివారం ఉదయం ఇటుకరాయిను ఆమె తలపై విసిరాడు. ఆమెకు స్థానిక ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు రాజశేఖరరావును గుడివాడ కోర్టుకు హాజరు పరచగా జడ్జి 15రోజుల రిమాండ్‌ను విధించారని ఎస్ఐ జి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు.

కంటి ఆపరేషన్ల కోసం ఏలూరుకు తరలింపు

మండవల్లి: ఏలూరు శంకర్ నేత్రాలయానికి మండవల్లి మండలం నుంచి 16 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం పంపినట్లు సర్పంచ్ మెండా ఝాన్సీ మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 26న స్థానిక నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఏలూరు శంకర్ నేత్రాలయం వైద్యాధికారులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన 16 మందికి కంటి ఆపరేషన్ల నిమిత్తం బస్సులో ఏలూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ ఏలూరు వెళ్లిన వారికి సహాయ సహకారాలు అందజేశారు.

సమష్టి కృషితో అభివృద్ధి వేగవంతం

ముదినేపల్లి రూరల్: స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల సమష్టి కృషితో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా అధికారులకు అన్నివిధాల సహకారం అందించాలని కోరారు. జిల్లాలోనే మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే దిశగా ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామన్నారు. ఎంపీడీఓ గంగాధరరావు మాట్లాడుతూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వ్యవసాయశాఖాధికారి బి వేణుమాధవ్, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు సునీత, రాచూరి రాధా, మండల కో-ఆప్షన్ సభ్యుడు అల్లాభక్షు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

కైకలూరు: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని వరహాపట్నం సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, ఎంఈఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లోని డ్రెయిన్లలో దోమల నివారణ మందును మంగళవారం పిచికారీ చేయించారు. అనంతరం ప్రతి ఇంటినీ సర్వే చేసి దోమల లార్వా నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యశాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానంగా ఇంటి పరిసరాల్లో తొట్టెలు, డ్రమ్ముల్లో నీరు నిల్వ లేకుండా పారవేయాలన్నారు. స్టాప్ మలేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎంఈఓ శ్రీనివాసరావు పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రత, దోమల నివారణ అంశాలను వివరించారు. ఎంపీహెచ్ఈఓ కె.తాతారావు, ఎంఎల్‌హెచ్‌పీ ఐ.రమ్య, ఏఎన్‌ఎం. టి.కల్పన, హెల్త్ అసిస్టెంట్ ఆర్. నరేష్ బాబు పాల్గొన్నారు.